


అందరికీ తిరుపతే కావాలంట



ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న ఉద్యోగుల బదిలీల్లో ఎక్కువ మంది తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో పనిచేసేందుకు ఇష్టపడుతున్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. కానీ, తిరుపతి నుంచి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవారు కరువయ్యారు. ఈ సమస్యపై బుధవారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించనున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చిత్తూరు జిల్లాలో 43 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో తిరుపతికి 31 మంది, అన్నమయ్యకు 12 మంది వెళ్తామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ విషయానికొస్తే.. డిప్యూటీ తహసీల్దార్లు చిత్తూరు నుంచి తిరుపతికి 8 మంది, అన్నమయ్యకు ముగ్గురు, అన్నమయ్య నుంచి తిరుపతికి ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వోలు చిత్తూరు నుంచి తిరుపతికి 10 మంది, అన్నమయ్యకు 13 మంది వెళ్తామంటున్నారు. సీనియర్ అసిస్టెంట్లు చిత్తూరు నుంచి తిరుపతికి ఐదుగురు, అన్నమయ్య జిల్లాకు ముగ్గురు, అన్నమయ్య నుంచి తిరుపతి ఒకరు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రస్తుత చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో పనిచేసే వారిలో ఎక్కువ మంది ఇప్పటికే తిరుపతిలోనే నివాసం ఉంటున్నారు. రోజువారీగా విధులకు వచ్చి వెళుతున్నారు. వీరంతా తిరుపతి జిల్లాకు దరఖాస్తు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలా బదిలీ అవసరమున్న ఉద్యోగులు తమకు పరిచయమున్న కూటమి నేతల ద్వారా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు సంపాదిస్తున్నారు. అటెండర్ల నుంచి అధికారుల వరకు.. తాము చేసుకున్న దరఖాస్తుకు ఆయా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల్ని కచ్చితంగా జత చేస్తున్నారు. బదిలీకి అవకాశం లేని వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అధికారులకు అర్థం కావడం లేదు.

- సిఫార్సు లేఖలతో ఉద్యోగుల ప్రయత్నాలు ముమ్మరం
- చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవారు కరువు
- బదిలీలపై నేడు మూడు జిల్లాల కలెక్టర్ల సమీక్ష

ఎవరైనా 'అన్నమయ్య'కు వస్తారా?

అన్నమయ్య జిల్లా మదనపల్లె మున్సిపాలిటీలో పనిచేసే ఓ ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ భర్త చిత్తూరు పక్కన తమిళనాడు రాష్ట్రంలో బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆమె చిత్తూరు చుట్టుపక్కల బదిలీ కోరుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆమెను చిత్తూరుకు పంపేందుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ సిద్ధంగా లేరు. చిత్తూరు నుంచి అన్నమయ్య జిల్లాకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న అదే హోదా కలిగిన ఉద్యోగి కావాలి. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా 'అలా చిత్తూరు నుంచి అన్నమయ్యకు వెళ్లేవారు ఉంటే చూసుకుని రండి' అంటూ వారికి సలహా ఇచ్చారు. దీంతో వారు అన్నమయ్య జిల్లాకు మ్యూచువల్‌గా వచ్చే వారున్నారా అంటూ వెతికే పనిలో పడ్డారు.

ఇలాంటి ప్రత్యేక కేసుల్ని పరిగణనలోకి తీసుకోవాలి

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే ఓ మహిళా వీఆర్వోకు తిరుపతికి బదిలీ అవ్వాల్సిన అవసరం ఉంది. ఆమె ఒంటరి మహిళ కావడంతో పాటు తన నాలుగేళ్ల కుమార్తె క్యాన్సర్‌తో బాధ పడుతోంది. తిరుపతిలోని తల్లిదండ్రుల వద్ద కుమార్తెను ఉంచి నిత్యం చిత్తూరుకు వచ్చి వెళ్లడం కష్టంగా మారింది. అదే తిరుపతిలో అయితే కుమార్తె బాగోగులు దగ్గరుండి చూసుకుంటూ ఉద్యోగం చేసుకోవచ్చు. ఆమె తిరుపతికి వెళ్లాలంటే అక్కడి నుంచి చిత్తూరుకు మరో వీఆర్వో రావాలనే నిబంధన ఉంది. తాజా బదిలీ తీరు చూసుకుంటే తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. అందరూ తిరుపతే కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో ఇలాంటి వారికి మానవతా దృక్పథంతో అధికారులు న్యాయం చేయాల్సి ఉంది.

మ్యూచువల్ ఉంటేనే అనుమతి

తన జిల్లా నుంచి ఒక ఉద్యోగిని కలెక్టర్ రిలీవ్ చేయాలంటే కచ్చితంగా అదే హోదా కలిగిన వ్యక్తి బయటి నుంచి రావాల్సి ఉంది. అందరూ చిత్తూరు నుంచి వెళ్లిపోతామనే దరఖాస్తులు చేసుకుంటున్నారే తప్ప, జిల్లాకు వస్తామనే దరఖాస్తులు లేవు. అధికారులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో మ్యూచువల్ ఉంటేనే బదిలీలను పరిగణనలోకి తీసుకోనున్నారు. అంటే చిత్తూరు నుంచి తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల స్థానంలో అక్కడి నుంచి అదే హోదా కలిగిన ఉద్యోగి చిత్తూరుకు వస్తేనే బదిలీ చేస్తారు. లేకుంటే పరిగణనలోకి తీసుకునే అవకాశాలు తక్కువ. తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి రావాలన్నా ఇదే సూత్రంగా అమలు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీలపై ఉత్కంఠ

చిత్తూరు కలెక్టరేట్: స్టాంపులు- రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగుల బదిలీ మార్గదర్శకాలపై సబ్‌రిజిస్ట్రార్లలో ఉత్కంఠ నెలకొంది. ఆదాయార్జన శాఖ కావడంతో రెండేళ్లా? లేదా ఐదేళ్ల సర్వీసును ప్రాతిపదికగా తీసుకుంటారా? జీరో సర్వీసు అంటారా? అన్న దానిపై చర్చలు జరుగుతున్నాయి. బదిలీలకు అనుమతిచ్చి వారం రోజులవుతున్నా ఇంతవరకు మార్గదర్శకాలు అందలేదు. వైసీపీ హయాంలో ఈ శాఖలో బదిలీలు చాలావరకు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరిగాయి. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన సబ్‌రిజిస్ట్రార్లను నియమించుకుని అడ్డగోలుగా భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారంటూ ఆరోపణలొచ్చాయి. నగరి నియోజకవర్గంలోని సబ్‌రిజిస్ట్రార్లు అక్కడి ప్రజాప్రతినిధికి నెల మామూళ్లు ఇచ్చేవారని విమర్శలున్నాయి. అలాగే చిత్తూరు ఓ సబ్‌రిజిస్ట్రార్ అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి సస్పెండ్ కావడంతో పాటు జైలుకు కూడా వెళ్లారు. ప్రస్తుతం అలాంటివాటికి తావు లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని, మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారిని ఫోకల్ స్టేషన్లలో నియమించాలని ఉద్యోగవర్గాలు కోరుతున్నాయి. కాగా, రెండేళ్ల కిందట చాలామంది సబ్‌రిజిస్ట్రార్లు బదిలీల నుంచి తప్పించుకోవడానికి పలు ఉద్యోగ సంఘాల్లో సభ్యత్వాలు తీసుకున్నారు. వీరికి స్థానచలనం నుంచి మినహాయింపు ఉంటుందని భావిస్తున్నారు. ఇదే జరిగితే చాలామందికి అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. పదవుల్ని చూసి అలాంటి వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వద్దని కొందరు సబ్‌రిజిస్ట్రార్లు కోరుతున్నారు.

'తీపి' కబురు

రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. సెప్టెంబరు నెల నుంచి బియ్యంతో పాటు చక్కెర పంపిణీకి చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పౌరసరఫరాల శాఖ ప్రక్షాళనపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. సరుకుల సరఫరాలో అనేక అవకతవకలు గుర్తించి, చక్కదిద్దేందుకు రెండు నెలలుగా చక్కెర పంపిణీ నిలిపివేసింది. సెప్టెంబరు నుంచి కొత్త ప్యాకింగులో పంచదార పంపిణీకి రంగం సిద్ధం చేసింది. గత వైసీపీ ప్రభుత్వం రేషన్‌పై నిత్యవసరాలను తగ్గిస్తూ చివరకు బియ్యానికే పరిమితం చేసింది. ఎంతో కీలకమైన కందిపప్పును ఏడాదిగా నిలిపివేసింది. మూడునెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్డుదారులకు సరకుల సరఫరాపై జిల్లాలవారీగా లబ్ధిదారులు, డీలర్లు, ఎండీయూ వాహనదారులతో సర్వే చేపట్టింది. కాగా, జిల్లాలో 5,43,202 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుదారుల్లో ఒక్కొక్కరికి 5 కిలోల వంతున ఉచిత బియ్యం, నగదుకు అరకిలో చక్కెర ఇస్తారు. వచ్చేనెల నుంచి కొత్త ప్యాకింగ్‌తో పాటు నిల్వవున్న పాత ప్యాకింగ్‌లోని చక్కెర పంపిణీ చేస్తామని డీఎస్వో శంకరన్ తెలిపారు.

- చిత్తూరు కలెక్టరేట్



కొత్త ప్యాకింగ్‌లో చక్కెర

జిల్లాకు తొలి మహిళా జేసీ

● నేడు విద్యాధరి బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 27: చిత్తూరు జిల్లా తొలి మహిళా జాయింట్ కలెక్టర్‌గా విద్యాధరి బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు మహిళా జాయింట్ కలెక్టర్‌గా ఎవరూ బాధ్యతలు నిర్వహించలేదు. కడప జిల్లా నందలూరుకు చెందిన ఈమె ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో బీటెక్ చేసి, చెన్నైలో ఐఏఎస్ చేశారు. ఈమె 2021వ బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి. గతంలో ఐటీడీఏ పీవో అభిషేక్‌ను జేసీగా నియమించగా, ఆ ఉత్తర్వును ప్రభుత్వం రద్దుచేసి, విద్యాధరిని జేసీగా నియమించింది. చిత్తూరుకు ఆమె బుధవారం ఉదయం 8 గంటలకు చేరుకున్నా, యమగండం కారణంగా 9 గంటల అనంతరం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో అధికారపూర్వకంగా బాధ్యతలు చేపట్టనున్నారు.

నేటి నుంచి రాయితీపై ఉలవల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 27: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగకు ప్రత్యామ్నాయంగా ఉలవలను సబ్సిడీపై రైతులకు అందజేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. 29 మండలాల్లో 30,792 హెక్టార్లలో ఉలవల సాగుకు 7698 క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం 6,075 క్వింటాళ్ల రైతు సేవా కేంద్రాల ద్వారా బుధవారం నుంచి అందించనున్నట్లు తెలిపారు. క్వింటాలు ఉలవల ధర రూ.8700 కాగా రూ.6960 సబ్సిడీ పోను రూ.1740 చెల్లించి రైతులు పొందవచ్చన్నారు. సబ్సిడీ విత్తన పంపిణీలో కౌలు, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

పలువురు సీఐల బదిలీ

చిత్తూరు, ఆగస్టు 27: జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. పూతలపట్టు సీఐ సుదర్శన్‌ప్రసాద్, బంగారుపాళ్యం సీఐ లక్ష్మయ్యను వేకెన్సీ రిజర్వు (వీఆర్)కు పంపారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్‌ను పూతలపట్టుకు, శ్రీనివాసులును బగారుపాళ్యంకు బదిలీ చేశారు.

పండుగలా బ్రహ్మోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ, ఎమ్మెల్యే

● సమష్టి కృషితో విజయవంతం చేయండి ● కాణిపాకంలో అధికారులతో ఎమ్మెల్యే, కలెక్టరు, ఎస్పీ సమీక్ష

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 27: 'కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలి. సమష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయండి' అంటూ అధికారులకు ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టరు సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ పిలుపునిచ్చారు. కాణిపాక ఆలయ సమావేశ మందిరంలో మంగళవారం వీరు జిల్లా స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. సెప్టెంబరు 7 నుంచి మొదలయ్యే బ్రహ్మోత్సవాల్లో ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తారన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 450 మంది సిబ్బందితో భద్రత కల్పించనున్నట్లు వివరించారు. అడుగడుగున సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతి, చిత్తూరు నుంచి కాణిపాకం వచ్చే మార్గాలను పూర్తిగా బాగు చేయాలని, కాణిపాకంలో రథం తిరిగే దారిని రిపేరు చేయాలని ఆర్&బీ అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసే భక్తుల కోసం అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవ వివరాలను భక్తులకు తెలిసేలా సమాచార శాఖ వ్యవహరించాలన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని,అదనంగా జనరేటర్‌ను సిద్ధం చేసుకోవవాలని ట్రాన్స్‌కో అధికారులకు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసి పోలీసులు పర్యవేక్షించాలన్నారు. 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడు స్వామి దర్శనం సమయంలో ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఆలయ బ్రహ్మోత్సవాల నిర్వహణలో ఆలయానికి చెందిన 14 గ్రామాల ఉభయదారులు తమ సహకారాన్ని అందించాలన్నారు. ఈ బ్రహ్మోత్సవాలు భక్తుల గుండెల్లో పదికాలల పాటు నిలిచి పోయేలా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో వాణి, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, ధనుంజయ, హరిమాధవరెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, డీఎస్పీ సాయినాథ్, ఎక్సైజ్ అధికారి ఆయేషాబేగం, ఆలయ ఉభయదారుల సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్ బాబు, మాజీ జడ్పీటీసీ లత, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎం.ఎస్.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 7 నుంచి 27వ తేది వరకు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి వేడుకలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 8న ధ్వజారోహణం, హంస వాహనం, 9న నెమలి వాహనం, 10న మూషిక వాహనం, 11న శేష వాహనం, 12న ఉదయం నిలుక వాహనం, రాత్రి వృషభ వాహనం, 13న గజ వాహనం, 14న రథోత్సవం, 15న బిక్షాండి, సాయంత్రం తిరుకల్యాణం, రాత్రి అశ్వవాహనం, 16న సాయంత్రం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంత సేవ,తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాలలో బాగంగా 17న అధికారనంది వాహనం, 18న రావణబ్రహ్మావాహనం, 19న యాళివాహనం, 20న విమానోత్సవం, 21న పుష్పపల్లకి సేవ,22న కామధేను వాహనం, 23నసూర్యప్రభ, 24నచంద్రప్రభ, 25న కల్పవృక్షవాహనం, 26న పూలంగిసేవ, 27న తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.

పలమనేరులో ప్రైవేటు క్లినిక్ సీజ్



సీజ్ చేసిన శ్రీనివాస క్లినిక్ వద్ద డాక్టర్ ఆశ

పలమనేరు, ఆగస్టు 27: పలమనేరులోని శ్రీనివాస క్లినిక్‌ను మంగళవారం వైద్యాధికారిణి ఆశ, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ సీజ్ చేశారు. జ్వరంతో వచ్చిన ఇంటర్ విద్యార్థిని తేజశ్రీకి గత గురువారం ఈ క్లినిక్‌లో వేసిన ఇంజక్షన్, మాత్రలు వికటించడం.. ఆ తర్వాత పలు ఆస్పత్రుల్లో చికిత్స చేసినా ఫలితం లేక సోమవారం మృతిచెందిన విషయం తెలిసిందే. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు శ్రీనివాస క్లినిక్ వద్దకు తేజశ్రీ మృతదేహంతో వచ్చి ఆందోళన చేసి అద్దాలు పగులగొట్టారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు. ఈ సంఘటన, బాధితుల ఆవేదన మంగళవారం పత్రికల్లో ప్రచురితమవడంతో జిల్లా వైద్యాధికారులు స్పందించారు. ఆర్‌ఎంపీలు నడుపుతున్న శ్రీనివాస క్లినిక్‌ను వెంటనే సీజ్ చేయాలని పాతపేట అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు ఆశను ఆదేశించారు. దీంతో ఆమె, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ సిబ్బంది వెళ్లి క్లినిక్‌ను సీజ్ చేసి.. నోటీసు అంటించారు. ఆర్‌ఎంపీలు నిర్వహించే క్లినిక్‌లలో ఇంజక్షన్లు వేయరాదని, మందుల చీటీలు రాసి పంపరాదని, క్లినిక్ ఆవరణలో మందులు విక్రయించరాదని, రోగులకోసం బెడ్లు ఉంచరాదని, సెలైన్లు పెట్టకూడదని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అనంతరం వైద్య బృందం తేజశ్రీ ఇంటికి వెళ్లారు. ఆమెకు జ్వరం ఎప్పుడు వచ్చింది. ఎక్కడెక్కడ చికిత్స చేయించారు? ఏమందులు వాడారనే వివరాలను తెలుసుకొన్నారు. దీనిపై సమగ్ర నివేదికను జిల్లా అధికారులకు పంపుతున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కాగా, బైరెడ్డిపల్లె మండలంలోనూ ఆర్‌ఎంపీలు నిర్వహించే క్లినిక్‌లను అక్కడి డాక్టర్లు తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తేజశ్రీ ఇంటివద్ద విచారిస్తున్న వైద్య బృందం

టపాకాయల నిల్వలపై పోలీసుల దాడులు



సీజ్ చేసిన టపాకాయలు

● ఎస్ఆర్‌పురంలో 9.60 లక్షల సామగ్రి సీజ్

శ్రీరంగరాజపురం, ఆగస్టు 27: ఎస్ఆర్‌పురం మండలంలో టపాకాయల అక్రమ నిల్వలపై పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం గంగవరం మండలం మారేడుపల్లెలో జరిగిన టపాకాయల పేలుడులో భార్యభర్తలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత తనిఖీలు మమ్మురం చేశారు. మంగళవారం పిళ్లారికుప్పం పంచాయతీ మూలూరులో దామోదర్‌రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన టపాకాయలను సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ సీజ్ చేశారు. కేసు నమోదు చేశారు. వీటి విలువ సుమారు రూ.9.60లక్షలు ఉంటుందని అంచనా. లైసెన్సు లేకుండా టపాకాయలను నిల్వ చేస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. గ్రామాల్లో టపాకాయలు నిల్వ ఉంచినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

కాణిపాకంలో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



గోవుకు చెరకు పెడుతున్న ఇన్‌చార్జి ఈవో వాణి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 27: కాణిపాక క్షేత్రంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఆలయ అధికారులు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాణిపాకానికి చెందిన ఎ.ధనంజయయాదవ్, ఎస్.రాజేంద్ర యాదవ్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ప్రధాన ఆలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ఆలయ ఇన్‌చార్జి ఈవో వాణి, సిబ్బంది పూజా సామగ్రిని గోశాలకు తీసుకొచ్చారు. గోశాలలో గోవు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. గోశాల పూర్తిగా మామిడి తోరణాలు, అరటి బోదెలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల మంత్ర ఘోష నడుమ గోవులకు పూజలు చేశారు. ఏటా కృష్ణాష్టమి రోజున గోవులకు అరటి పండు, దాణా, చెరకు ఆకు పెట్టడం ఆనవాయితీ. అనంతరం గోశాల ప్రాంగణంలో అధికారులు ఉట్టి కొట్టి ఉత్సవాన్ని నిర్వహించారు. కాణిపాకానికి చెందిన చిన్నారులు గోపిక, శ్రీకృష్ణ వేషధారణలతో అలరించారు. మండలంలోని మలారపల్లెలోని గోశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీకృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాలుడి ఊరేగింపు



ఆలయం ఎదుట ఉత్సాహంగా ఉట్లోత్సవం

భక్తిశ్రద్ధలతో గోకులాష్టమి

వెదురుకుప్పం, ఆగస్టు 27: కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగవారం గోకులాష్టమి వేడుకలను ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, అర్చన కార్యక్రమాలు జరిపించారు. తర్వాత భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో నిర్వహించారు. సాయంత్రం పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య ఉట్లోత్సవం నిర్వహించారు. రాత్రి శుద్ధి తరువాత ఏకాంత సేవ చేయించారు. టీడీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, బాబు సురేష్, ప్రధాన అర్చకులు గోపాల ఆచార్యులు, శబరి, రమేష్, భక్తులు హాజరయ్యారు.

అమాంతం పెరిగిన కొబ్బరి ధరలు



వెంగళ్రాజుకుప్పంలో కొబ్బరికాయలకు పొట్టు తీస్తున్న కూలీలు

పాలసముద్రం, ఆగస్టు 27: కొబ్బరిధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఏడాదిగా కొబ్బరిధర ధర స్థిరంగా ఉంది. వెయ్యి కాయల ధర రెండు వారాల క్రితం వరకు రూ.8000-8500 మధ్య పలికేది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో ధరలు అమాంతం పెరిగాయి. వెయ్యి కాయల ధర రూ.11వేల నుంచి రూ.12వేల వరకు పలుకుతోంది. తక్కువ ధరలు ఉన్నప్పుడు వ్యాపారులు ముందుచూపుతో కొనుగోలు చేసి నిల్వచేసుకున్నారు. ప్రస్తుతం రైతుల దగ్గర ఎక్కువ కాయలు లేవు. వినాయక చవితి నేపథ్యంలో కొబ్బరి ధర మరింత పెరిగే అవకాశముందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. రెండేళ్ళుగా కొబ్బరితోటలకు నల్లి సోకడం వల్ల కాయల దిగుబడి తగ్గింది. తమిళనాడులోని షోలింగర్, చెన్నై, ఆర్కాడు వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు రోజూ వచ్చి కొబ్బరికాయలను కొనుగోలు చేస్తున్నారు. ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



పుంగనూరు రూరల్, ఆగస్టు27: అక్రమ మార్గంలో తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యం, నాటు సారాను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీధర్ రావు తెలిపారు. పుంగనూరు పట్టణం భగత్‌సింగ్ కాలనీ సమీపంలో మంగళవారం 5728 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని, 230 లీటర్ల నాటుసారాను ఎక్స్‌కవేటరుతో తొక్కించి ధ్వంసం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు అర్బన్‌సీఐ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

● 12 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన వాహనం



గాయపడిన వారు

బంగారుపాళ్యం, ఆగస్టు 27: బంగారుపాళ్యం మండలం.. చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలోని మొగిలి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కొందరు కాణిపాకం ఆలయానికి కారులో బయలుదేరారు. మొగిలి వద్దకు చేరుకోగానే చిత్తూరు వైపు వెళ్తున్న గూడ్స్ క్యారియర్ లారీ వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో నిర్మల, క్రిష్ణమ్మ, నల్లక్క, లక్ష్మీదేవి, ఐశ్వర్య, ధనలక్ష్మి, ఓబులమ్మ, వెంకటరమణమ్మ, లీలావతి, రామలక్ష్మి, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వళ్లెమ్మ తెలిపారు.

భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరుకోవాలి

రూ.5కోట్లకుపైగా పన్నులు ఎగవేస్తే క్రిమినల్ కేసులు

జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ హెచ్చరిక



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: 'ప్రధాని మోదీ కలలు కంటున్న వికసిత్ భారత్ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానం నుంచి 2029 నాటికి మూడో స్థానం చేరుకోవాలి. ఈ విషయంలో పన్ను చెల్లింపుదారుల సహకారం అవసరం' అని జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనందకుమార్ తెలిపారు. తిరుపతి జీఎస్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకే దేశం, ఒకే పన్ను విధానం ఉండాలనే 33 రకాల సెస్సులు, 17 రకాల పన్నులు రద్దు చేసి.. జీఎస్టీ అమలు చేశారని గుర్తుచేశారు. జీఎస్టీ ఆడిట్ ద్వారా దేశ వ్యాప్తంగా రూ.2,676 కోట్లు పన్నులు ఎగవేసినట్లు గుర్తించగా.. అందులో రూ.272 కోట్లు రికవరీ చేసినట్లు ప్రకటించారు. రూ.5కోట్లకుపైగా పన్నులు ఎగవేస్తే మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇటీవల ఓ ఎరువుల వ్యాపారి చెల్లించాల్సిన రూ.1300 కోట్లు ఎగవేస్తే అతడికి నోటీసులు జారీ చేశామని, ఇందులో రూ.20 లక్షలు సబ్సిడీ ఇవ్వడం జరిగిందన్నారు. కొవిడ్ కారణంగా నాలుగేళ్లుగా పన్నులు చెల్లించని వారికోసం కేంద్ర ప్రభుత్వం వడ్డీ, అపరాధ రుసుం చెల్లింపులో మినహాయింపు ఇచ్చిందన్నారు. వికసిత్ భారత్‌తో ఇప్పటి వరకు భారత ప్రభుత్వం వివిధ రంగాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.11 లక్షల కోట్లు విడుదల చేయడం జరిగిందని వివరించారు. అందులో భాగంగా ఏపీకి మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.65,000 కోట్లు విడుదల చేసిందన్నారు.

అనంతపురం, కర్నూలులో సబ్ ఆఫీసులు

జీఎస్టీ ఆడిట్ సబ్ ఆఫీసులు కొత్తగా అనంతపురం, కర్నూలులో ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. జీఎస్టీ అమల్లోకి రాకముందు 70 లక్షల మంది పన్నుచెల్లింపుదారులు ఉండగా, ఇప్పుడా సంఖ్య 140 లక్షలకు చేరిందన్నారు. డిసెంబరులోగా దేశంలోని 532 యూనిట్లు ఆడిట్ చేయాల్సి ఉందని చెప్పారు. గతంలో సిగరెట్లపైన 300 శాతం పన్ను చెల్లిస్తుండగా ప్రస్తుతం 35 శాతమే పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగం, సూపర్ మాల్స్‌కు పన్నులు లేవన్నారు. తిరుపతి జీఎస్టీ ఆడిట్ జాయింట్ కమిషనర్ అంబి, అసిస్టెంట్ కమిషనర్ మాలతి, జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 27: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగ సంక్షేమశాఖల వసతిగృహాల్లో విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంక్షేమశాఖల వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలతో ఆయన సమావేశమయ్యారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో వసతిగృహాలలో చేర్పిస్తుంటారని, అలాంటి వారి చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రెసిడెన్షియల్ వసతి గృహాల్లో ప్రతిరోజు రాత్రి ఇద్దరు టీచర్లు ఉండేలా చూడాలన్నారు. ఏఎస్‌డబ్ల్యూవోలు నెలకు 12 వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు. రామకుప్పం మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఎత్తు ప్రదేశంలో ఉండటం, సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రొవిజన్స్, గ్యాస్ తదితర వాటిని తీసుకురావడానికి వెండర్స్ ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ చెప్పగా.. సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయా శాఖల పరిధిలోని వసతి గృహాలు, ఎంతమంది విద్యార్థులు ఉన్నారనే వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల డీసీటీవో పద్మజ, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనం టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ ఆపాలి

ద్రావిడ వర్శిటీ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి ● జగన్‌కంటే చంద్రబాబు పాలన బాగుందన్న చింతా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

కుప్పం, ఆగస్టు 27: ఏడుకొండల మీద వెంకన్న బ్రేక్ దర్శనం టికెట్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడం దారుణమని మాజీ ఎంపీ చింతా మోహన్ విమర్శించారు. ఇప్పటికే వీఐపీలపాలైన ఈ టికెట్లు బ్లాక్ మార్కెటింగ్ దందాలో తగులుకుని సామాన్యులకు అందని ఎత్తులో నిలిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ అధికారులతోపాటు కొంత మంది ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రమేయం ఇందులో ఉందని ఆరోపించారు. వెంటనే సీఎం చంద్రబాబు స్పందించి, బ్రేక్ దర్శనం టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ ముఠాను గుర్తించి, బాధ్యులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వత్తాసు పలుకుతూ చంద్రబాబు ఎస్సీల పట్ల విభజించు పాలించు సూత్రాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. అయితే జగన్ పాలనకన్నా చంద్రబాబు పాలన ఎంతో బాగుందని మెచ్చుకున్నారు. అమరావతి జపం మాని రాష్ట్రమంతా సమ అభివృద్ధికోసం పాలన సాగించాలని కోరారు. కుప్పంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, ఇప్పటికీ స్థానికులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. స్థానికంగా పరిశ్రమలు స్థాపించి, ఉపాధి అవకాశాలను కల్పించి యువతను ఆదుకోవాలని కోరారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో సుమారు 250 మంది ఉద్యోగులకు 13 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వారంలోగా వారికి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటింటికీ సహజవాయువు

ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ ఎండీ



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న అఖిలేష్ గుప్తా

తిరుపతి అర్బన్, ఆగస్టు 27: విద్యుత్ తరహాలోనే సహజవాయువు(నేచురల్ గ్యాస్)ను త్వరలో ఇంటింటికీ సరఫరా చేయనున్నామని ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ ఎండీ, సీఈవో అఖిలేష్‌గుప్తా వెల్లడించారు. మంగళవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ.3,500కోట్ల పెట్టుబడితో సమగ్ర గ్యాస్ పైప్‌లైన్ నెట్‌వర్క్ అభివృద్ధి జరుగుతోందన్నారు. సిలిండర్ల రూపంలో కాకుండా పైపులైన్ల ద్వారా శ్రీసిటీ పరిశ్రమ భాగస్వామ్యంతో తక్కువ ధరలకు, పర్యావరణ రహిత సహజవాయువును అందించడమే తమ లక్ష్యమన్నారు. గృహ అవసరాలకే కాకుండా వాణిజ్యపరంగానూ గ్యాస్ సరఫరా చేయనున్నట్లు చెప్పారు. సాధారణ గ్యాస్‌తో పోలిస్తే 20శాతం తక్కువగా ధరలకే విక్రయిస్తామన్నారు. వినియోగాన్ని అనుసరించి ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే శ్రీసిటీలోని అన్ని పరిశ్రమలకు, ఉద్యోగుల వాహనాలకు, గృహ అవసరాలకు సహజవాయువును అందిస్తున్నామని గుర్తు చేశారు. రెండో దశలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో సరఫరా చేయడానికి ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. రీజనల్ హెడ్ గౌతమ్‌ఆనంద్ సహజవాయువు మాట్లాడుతూ.. తిరుపతి నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 80562 13276 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం



స్విమ్స్‌లో విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 27: స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 26 సీట్లకుగాను మంగళవారం తొలుతగా ఆరుగురు విద్యార్థులకు ఎంబీబీఎస్ అడ్మిషన్లను డైరెక్టర్ ఆర్వీకుమార్ అందజేశారు. వీరంతా నీట్ ఆలిండియా కోటాలో ర్యాంకులు సాధించిన పలు కేటగిరీలకు చెందిన విద్యార్థులు. అడ్మిషన్లు పొందిన వారిలో.. ఏపీ, ఢిల్లీ, జమ్మూకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఒక్కో విద్యార్థితోపాటు కేరళకు చెందిన ఇద్దరు విద్యార్థులున్నారు. ప్రిన్సిపాల్ ఉషా కళావత్, ఏడీ శశికళ, సూపరింటెండెంట్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో..: ఎస్వీ వైద్య కళాశాలలోనూ మంగళవారం ఐదుగురు విద్యార్థులకు ఎంబీబీఎస్ అడ్మిషన్లను ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అందజేశారు. కళాశాలలో 240 సీట్లకుగాను తొలిరోజున హర్యానా, మహారాష్ట్ర, కేరళకు చెందిన ఒక్కో విద్యార్థితోపాటు ఢిల్లీకి చెందిన ఇద్దరు విద్యార్థులకు అడ్మిషన్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఊరందూరు టీచరుకు జాతీయ అవార్డు

తన కష్టానికి గుర్తింపు లభించిందన్న సురేష్





డిజిటల్ రూపంలో పాఠాలు బోధిస్తున్న కూనాటి సురేష్

శ్రీకాళహస్తి, ఆగస్టు 27 : అవార్డుల కోసం తాను పని చేయలేదని, అయితే జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యానని తెలిసినప్పుడు తన శ్రమకు తగ్గ గుర్తింపు లభించినట్లు భావించానని సోషల్ టీచర్ కూనాటి సురేష్ చెప్పారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామానికి చెందిన సురేష్ తన సొంత మండలంలోని ఊరందూరు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూనే విద్యారంగానికి ఎన్నో విశేష సేవలను అందించారు. ఆయన విశేష సేవలను రాష్ట్రప్రభుత్వం గుర్తించి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రకటించింది.సెప్టెంబరు 5న ఢిల్లీలో జరిగే జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సురేష్ పురస్కారం అందుకోనున్నారు. రాష్ట్రం నుంచీ ఇద్దరే ఈ అవార్డుకు ఎంపికయ్యారు.పాఠ్యపుస్తకాలను రూపొందించడం, మారుతున్న సాంకేతిక విధానాలకు అనుగుణంగా డిజిటల్ కంటెంట్ క్రియేట్ చేయడం, ఉచిత పాఠ్యాంశాలను బోధించే మొబైల్‌యాప్ ఉచితంగా అందించడం వంటి ఎన్నో సేవలను ఆయన విద్యార్థులకు చేరువ చేశారు. విద్యార్థులకు అవసరమైన వర్క్ బుక్కులతో పాటు పిక్టోరియల్ సోషల్ స్టడీస్ అనే పుస్తకం ద్వారా దాదాపు వెయ్యి చిత్రాలను, మ్యాపులతో కూర్చి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా తయారు చేసి ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు విజయోస్తు, విజయ సాధన సంకల్పం, మహా సంకల్పం, విజయ స్ఫూర్తి పేర్లతో మెటీరియల్ తయారు చేసి సాంఘిక శాస్త్ర ఫలితాల్లో అగ్రభాగాన ఉండేందుకు కృషి చేశారు.విద్యాపరమైన శిక్షణా తరగతుల్లో రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.డ్రాపౌట్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులను తరచూ కలిసి వారిని మళ్లీ పాఠశాలకు పంపించేలా కౌన్సెలింగ్ ఇచ్చారు.డిజిటల్ మ్యాపులు తయారు చేసి ఉపాధ్యాయులందరికీ ఉచితంగా పంచిపెట్టారు.ఈయన ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తరఫున జాతీయ ఉత్తమ ఐసీటీ ఉపాధ్యాయ అవార్డు, ఆంధ్ర రత్నం అవార్డు, గ్లోబల్ బెస్ట్ టీచర్ అవార్డు, బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కార్ , గురు మిత్ర అవార్డు, జిల్లాస్థాయిలో రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ప్రావీణ్య ఫౌండేషన్ ప్రత్యేక గుర్తింపు అవార్డు అందుకొని వుండడం విశేషం.

అమర ఆస్పత్రిలో తెగిన బొటనవేలికి శస్త్రచికిత్స



శస్త్రచికిత్స ద్వారా అతికించిన వేలును చూపుతున్న బాధితుడు

రేణిగుంట, ఆగస్టు 27: ప్రమాదవశాత్తు తెగిపడిపోయిన బొటన వేలును శస్త్రచికిత్స చేసి అతికించినట్లు అమర ఆస్పత్రి డాక్టర్ వాసుదేవ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన చిన్నారెడ్డికి ప్రమాదవశాత్తూ బొటనవేలు తెగిపోయిందన్నారు. ఐస్‌బాక్సులో బొటనవేలిని భద్రపరిచి నాలుగు గంటల లోపు ఆస్పత్రికి తీసుకువచ్చారని, దాదాపు మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి తెగిన బొటనవేలిని అతికించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో యథాతథంగా బొటనవేలు పనిచేస్తుందన్నారు. ఇప్పటికే అమర ఆస్పత్రిలో ఇలాంటి 25 శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ వాసుదేవరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

రాజన్న ఫౌండేషన్‌కు

సీఎస్ఆర్ టైమ్స్‌గోల్డ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సతీష్ రాళ్లపల్లి

రేణిగుంట, ఆగస్టు 27: అమరరాజా కంపెనీ సౌజన్యంతో నడిచే రాజన్న ఫౌండేషన్ నైపుణ్యాభివృద్ధి విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన సీఎస్ఆర్ టైమ్స్ గోల్డ్ అవార్డు దక్కించుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఫౌండేషన్ అందించిన సేవలను గాను గోవా రాజ్‌భవన్‌లో జరిగిన నేషనల్ సీఎస్ఆర్ సమ్మిట్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా మంగళవారం ఫౌండేషన్ అధికారి సతీష్ రాళ్లపల్లి అవార్డును అందుకున్నారు. అవార్డు రావడం పట్ల రాజన్న ఫౌండేషన్ ఫౌండర్ గల్లా రామచంద్రనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. కాగా, 2014లో స్థాపించిన అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 2వేలమంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి అమరరాజా సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. ఈ వివరాలను మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 76,910 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,320 మంది తలనీలాలు సమర్పించినట్లు పేర్కొంది.

చంద్రబాబును కలిసిన శాంతిపురం నాయకులు



శాంతిపురం, ఆగస్టు 27 : ముఖ్యమంత్రి చంద్ర బాబును టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, ఇతర నాయకులు మంగళవారం విజయ వాడలోని ఆయన నివాసంలో కలిశారు. మండలంలోని పలు సమస్యలు పరిష్కరించాలని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరినట్లు విశ్వనాథనాయుడు తెలిపారు. ఇప్పటికే మండలంలోని గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు వేయాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం చెప్పారని వివరించారు. అలాగే కొంతమంది మండల నాయకులు నామినేటెడ్ పోస్టులకు దరఖాస్తులు అందించారని వాటిపైన ఆయన సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. అనంతరం మంత్రి లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించినట్లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ఏఎంసీ నాగరాజు, సింగిరి శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, ఈడిగ శివశంకర్ గౌడు, యూనిట్ ఇన్‌చార్జి పెద్దన్న, భాస్కర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

బోటనీ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, ఆగస్టు 27 : శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం (బోటనీ) అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.విజయకుమార్ తెలిపారు. బోటనీలో ఎమ్మెస్సీ పూర్తిచేసి 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 30లోగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

కోదండరామాలయ పునర్నిర్మాణ నమూనాలు సిద్ధం

శాంతిపురం, ఆగస్టు 27 : మండల పరిధిలోని రాళ్లబూదుగూరు పురాతన కోదండ రామాలయం పునర్నిర్మాణ నమూనాలను, నిర్మాణ వ్యయం అంచనాలను దేవదాయ శాఖ అధికారులు డీఈ శ్రీనివాసులు, ఏఈ ఆనంద్‌లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు అందజేశారు. మంగళవారం రాళ్లబూ దుగూరు రామాలయంలో అధికారులు పర్యటించారు. గ్రామస్తులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్సీకి నివేదిక అందజేశారు. గుడి పునర్నిర్మాణానికి సుమారు రూ.7.55 కోట్లు అవుతుందని అధికారులు వివరించినట్లు రాళ్లబూదుగూరు యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణి తెలిపారు. త్వరలోనే శిథిలమైన ఆలయ గోడలను తొలగించి నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారని వివరించారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన



కుప్పం రూరల్, ఆగస్టు 27: మండంలోని మల్లానూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం మంగళవారం తహసీల్దారు చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌లు స్థలాన్ని పరిశీలించారు. స్థల సేకరణ దాదాపు పూర్తయిందని, భవనాల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా ఇప్పటికే హైస్కూల్ ఆవరణలో జూనియర్ కళాశాల నడుస్తున్న విషయం తెలిసిందే.

నేడు సామాజిక తనిఖీ

పలమనేరు, ఆగస్టు27 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని స్త్రీశక్తి భవనంలో ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేష్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు, ఆగస్టు27 : పలమనేరు కోర్టు ఆవరణలో సెప్టెంబరు 14వ తేదీ శనివారం జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత కోరారు. మంగళవారం కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేందుకు పోలీసు అధికారులు దృష్టిసారించాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల వివాదాలు, చెక్‌బౌన్సు కేసులు, సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసేందుకు సహకరించాలన్నారు. ఈ సమా వేశంలో పలమనేరు సీఐ మురళీమోహన్, ఎస్ఐ స్వర్ణతేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, సీనియర్ న్యాయవాదులు పరమశివప్ప, క్రిష్ణమూర్తి, ఏజీపీ, సయ్యద్ ఇస్మాయిల్, రెడ్డెప్ప శెట్టి, ఆంజనేయులు ఇర్షాద్‌అలి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఫ్ఏ పరీక్షలు



ప్రశ్నాపత్రాలను తీసుకొంటున్న ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, ఉపాధ్యాయ బృందం

పలమనేరు, ఆగస్టు27 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి మండలంలోని పాఠశాలల్లో ఎఫ్ఏ- పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించి వచ్చిన పరీక్షా ప్రశ్నాపత్రాలు వారు తీసుకొన్నారు. ప్రశ్నపత్రాలను పరీక్ష రోజు గంట ముందు మాత్రమే ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఓఎంఆర్ షీట్ రోల్ ప్రకారం సరిపోని పక్షంలో ఆఫీసు నుంచి పొందాలని సూచించారు.

ప్రైవేటు క్లినిక్‌ల తనిఖీ



ఓ క్లినిక్‌లో తనిఖీచేస్తున్న వైద్యాధికారి విజయచందర్

బైరెడ్డిపల్లె, ఆగస్టు 27 : వైద్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం బైరెడ్డిపల్లె మండలంలో ఆర్ఎంపీ క్లినిక్‌లను బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ విజయ చందర్, డాక్టర్ అరుణ్‌కుమార్ తనిఖీచేశారు. ప్రథమచికిత్స మాత్రమే చేయాలని, రోగులకు ఇంజక్షన్ వేయడం, సెలైన్లు పెట్టడం, చిన్నపిల్లలు, గర్భిణులకు, బాలికలకు వైద్యం చేయడం నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది శ్రీదేవి, గోపి, హరి, నవీన, కవిత, సుజాత, భారతి పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నిధుల కోసం ద్రావిడ వీసీ, రిజిస్ట్రార్ వినతి



సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్నకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్‌లు

గుడుపల్లె, ఆగస్టు 27: ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఎం ఆచార్య దొరస్వామి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్‌లు సోమవారం అమరావతిలోని సచివాల యంలో ఉన్నత అధికారులను కలిశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొన్ని నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. వారికి జీతాలు అందించేందుకు విశ్వవిద్యాలయానికి గ్రాంటును త్వరగా విడుదల చేయాలని ఉన్నత విద్య, సీఎంవో అధికారులను కోరినట్లు తెలిపారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారని వివరించారు.

పూల దుకాణంలో చోరీ నగదు రికవరీ

పలమనేరు, ఆగస్టు27 : స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పూలదుకాణం వద్ద నగదు చోరీ చేసిన మహిళను పూలదుకాణదారులు పట్టుకున్నారు. మంగళవారం ఒక పూలదుకాణం నిర్వాహకురాలు పక్క దుకాణం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ మహిళ దుకాణంలో వెయ్యి చోరీ చేసింది. ఇతర పూలదుకాణదారులు గుర్తించి ఆమెను పట్టుకున్నారు. తర్వాత ఆమె నుంచి చోరీసొత్తు స్వాధీనం చేసుకున్నారు. చీవాట్లు పెట్టి పంపించేశారు.

కన్నుల పండువగా గోపాలుడి కల్యాణం



చౌడేపల్లె, ఆగస్టు27: స్థానిక బజారువీధిలో రుక్మిణి, సత్యభామ వేణుగోపాల స్వాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. మంగళవారం ఆలయ ఆవరణలో కల్యాణ మండ పంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

పుంగనూరు ఎస్ఐ రొంపిచెర్లకు బదిలీ



పుంగనూరు రూరల్, ఆగస్టు27: పుంగనూరు ఎస్ఐ సుబ్బారెడ్డి రొంపిచెర్లకు బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ మంగ ళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐ సుబ్బారెడ్డిని అర్బన్ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కాగా పుంగనూరులో ఎస్ఐ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు27: పుంగనూరు- రామస ముద్రం మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని తూర్పు మొగసాలకు చెందిన నాగరాజ కుమారుడు వినోద్‌కుమార్(33) సొంత పనులపై ద్విచక్రవాహనంలో రామసముద్రం వెళుతుండగా కేసీ పల్లె వద్ద కుక్క అడ్డురావడంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వినోద్‌కుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పట్టణంలో ఆటో చోరీ

పుంగనూరు రూరల్, ఆగస్టు 27: పట్టణంలోని కొత్తపే టలో ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. కొత్తపేటకు చెందిన రెహమాన్(35) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి యథావిధిగా ఆటోను ఇంటి ముందు ఉంచాడు. ఉదయం నిద్రలేచి చూడగా ఆటో కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ కిరణ్

చౌడేపల్లె/రొంపిచెర్ల, ఆగస్టు 27: రొంపిచెర్ల తహసీ ల్దార్‌గా కిరణ్ బాధ్యతలు స్వీకరిం చారు. ఈయన జిల్లా కార్యాల యం నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ లందరికీ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్క రిస్తానని తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయం అద్భుతం

శ్రీలంక రైతుల ప్రశంస



అంకిరెడ్లపల్లెలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శ్రీలంక రైతుల బృందం

కుప్పం, ఆగస్టు 27 కుప్పం నియోజకవర్గంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయం అద్భుతమైనదని శ్రీలంక రైతులు ప్రశంసించారు. వారు తమ పర్యటనలో రెండవ రోజైన శనివారం రామకుప్పం, శాంతి పురం, గుడుపల్లె మండలాల్లో పర్యటించారు. రామకుప్పం మండలం అంకిరెడ్లపల్లెలో వెంకటరమణకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఇక్కడ ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, ఎన్‌పీఎం దుకాణాలను పరిశీలించి వాటి విధివిధానాలను అడిగి తెలుసు కున్నారు. శాంతిపురం మండలం జంగాలపల్లెలో రైతు సత్య నారా యణకు చెందిన మామిడి తోటలో పీఎండీఎస్ పద్ధతిని పరిశీలిం చారు. అలాగే మునగలో అంతర పంటలు, పెరటి తోటలో 365 రోజులూ లాభాలు పొందే విధానాల గురించి రైతు వివరిస్తుంటే ఆసక్తిగా విన్నారు. గుడుపల్లె మండల పరిధిలోని విక్టరీ స్కూల్ ఆవరణలో పలు పండ్ల తోటల్లో ఏపీసీఎన్ఎఫ్ పద్ధతులు, పీఎండీఎస్, కూరగాయలు, ఆకు కూరలు సాగు విధానాలను పరిశీలించారు. స్కూల్ పిల్లలకోసం సాగు చేస్తున్నారని తెలుసుకుని యాజమాన్యాన్ని ప్రశంసించారు. కుప్పం నియోజకవర్గంలో రెండు రోజులపాటు సాగిన శ్రీలంక రైతుల బృందం పర్యటన మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు, సీనియర్ లీడ్ చంద్రశేఖర్, సురేంద్రరెడ్డి, శ్రీనివాసులు, డాక్టర్ పుష్ప, యశ్వంత్, రాజేశ్, గురుప్రసాద్, నాంచారమ్మ, కల్పన, మండలంలోని క్యాడర్లు నాగరాజు, వెంకటేశ్, మెంటార్లు, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఐడియా థాన్ కాంటెస్ట్‌కు కేఈసీ ఆతిథ్యం



ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, ఆగస్టు 27: అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఐడియా థాన్ (కుప్పం రీజనల్ రూరల్ పాథ్) కాంటెస్ట్‌కు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఆతిథ్యమిచ్చింది. ఈ కాంటెస్ట్ చిత్తూరు జిల్లా రీజియన్ పరిధిలో జరుగుతున్నట్లు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ తెలిపారు. ఐడియా థాన్ కాంటెస్ట్‌కు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా సునీల్ రాజ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ఐడియా థాన్ స్టార్టప్ కాంటెస్ట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం తమ కళాశాలకు దక్కడం ఆనందదాయకమని చెప్పారు. ఈ నెల 26న ఈ కాంటెస్ట్ ప్రారంభమైందన్నారు. కుప్పం రీజనల్ రూరల్ పిచ్ కాంటెస్ట్ సెప్టెంబరు 13వ తేదీన నిర్వహిస్తామన్నారు. ఇక్కడ సెలెక్ట్ అయిన వారికి స్టేట్ ఫైనల్స్ అక్టోబరు 1వ తేదీన జరుగుతాయని చెప్పారు. ఉద్వేగభరితమైన ఐడియా ప్రెన్యూర్స్ స్టార్టప్‌ల వ్యవస్థాపకుల ద్వారా ఈవెంట్‌కోసం తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, మెకానికల్ విభాగాధిపతి గణేశ్, ట్రిపుల్ ఈ విభాగాధిపతి శేఖర్, ఈవెంట్ కో-ఆర్డినేటర్ అజయ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు వరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఆగస్టు 27: ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆదేశాలతో కుప్పం నియోజక వర్గంలో ఏర్పాటు కానున్న కృషి విజ్ఞాన కేంద్రం ఇక్కడి రైతులకు ఒక వరమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మండలంలోని అంబాపురం గ్రామంలో మంగళవారం ఆయన అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఈ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందుతుందన్నారు. దీనికి సంబంధించి శిక్షణ ఇస్తామన్నారు. అలాగే 1100 ఎకరాల్లో డొమెస్టిక్ ఎయిర్ పోర్టుతోపాటు 500 ఎకరాల్లో కార్గో ఎయిర్ పోర్టు కూడా నిర్మిస్తామన్నారు. పరిశ్రమల స్థాపనకు సెజ్ ఏర్పాటు చేస్తామని ఫలితగా ఉద్యోగావకాశాలు మెరుగుపడు తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్. ముని రత్నం, కడా పీడీ పీఎస్.మునిరత్నం, తహసీల్దారు చిట్టిబాబు, ఎంపీడీవవో సాయి లహరి, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, రెవెన్యూ, మండల పరిషత్తు సిబ్బంది పాల్గొన్నారు.

గోపికలతో కృష్ణయ్య పుర విహారం



సోమల, ఆగస్టు 27: కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దఉప్పరపల్లె శ్రీకృష్ణ మందిరంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు హోమాది కార్యక్రమాలు జరిపారు. అనంతరం పుష్పపల్లకీలో గోపి కలను, శ్రీకృష్ణుడిని పురవీధుల్లో ఊరేగించారు. మహి ళలు ఇంటింటా మంగళహారతులు సమర్పించారు. ఆల యం వద్ద చిన్నారుల వినోద కార్యక్రమాలు అలరించాయి. ఉభయదారులు భక్తులకు అన్నదానం చేశారు. యాదవ సంఘ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయం వద్ద సీసీ కెమెరాల చోరీ

సోమల, ఆగస్టు 27: స్థానిక స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారని ఆలయ ధర్మకర్త బీవీ.సోమశేఖర్ తెలిపారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



సోమల, ఆగస్టు 27: సోమలలోని పలు వీధుల్లో వీధి దీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. విద్యుత్ విని యోగం తగ్గించాలని ట్రాన్స్‌కో అధికారులు కోరుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీకి భారీగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, వీధి దీపాలు పగలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని ఈ నెల 16న జరిగిన మండల సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి కార్యదర్శులను కోరారు. అయినా పలు పంచాయతీల్లో కార్యదర్శులు పట్టించుకోలేదు. ఫలితంగా పంచాయతీలకు విద్యుత్ బిల్లుల మోత మోగుతోందని జనం చర్చించుకుంటున్నారు.

అథ్లెటిక్స్‌లో పుంగనూరు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందిస్తున్న అధ్యాపకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు27: ఈ నెల 24న ఎస్వీయూ తారకమరామ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-23 విభాగంలో పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం క్రీడాపోటీల్లో అండర్-23 విభాగంలో సీడీ. జయలక్ష్మి ప్రతిభ చూపిందని వివరించారు. అదేవిధంగా హేమశ్రీ షాట్‌పుట్‌లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అలాగే పోటీల్లో దామోదర్, సాయిజతిన్, ఆసిఫ్‌అలీ, తరుణ్‌కుమార్, కౌశిక్ తదితర విద్యార్థులు పోటీల్లో పాల్గొనడంతో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రామకుమార్, అనిల్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ రాంభూపాల్

చౌడేపల్లె, ఆగస్టు27: దుకాణదారులు తప్ప కుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ సూచించారు. మంగళ వారం ఆయన స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో దుకాణదారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆలయం, షాపింగ్ కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్‌లు, రద్దీ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను నియంత్రించవచ్చన్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం తమ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. దుకాణదారులు, ఏఎస్ఐ వాసు పాల్గొన్నారు.

భాషాభివృద్ధికి గిడుగు కృషి అపారం: డీఈఓ



పుంగనూరు రచయితలకు సన్మానం

చిత్తూరు కల్చరల్/ పుంగనూరు, ఆగస్టు 27: మాధుర్యమైన తెలుగుభాష ప్రాంతాల వారీగా వివిధ యాసల్లో హృద్యంగా ఉంటుందని, జిల్లా విద్యా శాఖాధికారి దేవరాజులు అన్నారు. భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు వెంకట రామ మూర్తి చిరస్మరణీ యుల న్నారు. ప్రభుత్వ మ్యాంగో భవన్‌లో మంగళ వారం ఉమ్మడి సాహితీ వేత్తల సంఘాల ప్రతినిదుల ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాడుక భాషా ఉద్యమకారుడైన గిడుగు జయంతి వేడుకలు జరిగాయి. కట్టమంచి బాలక్రిష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. హరివిల్లు లితకళా పరిషత్ నిర్వాహకులు హరినాయుడు తెలుగు భాషా వైభవాన్ని విశదీకరించారు. గిడుగు చిత్రపటానికి సాహితీవేత్తలు పుష్పాంజలి ఘటించారు. అనంతరం కవిసమ్మేళనం, చిన్నా రులకు పద్య, గద్య పోటీలు నిర్వహించారు. రచ యిత్రి శాంతభాస్కర్ రచించిన "బాలలకోసం సైన్స్ వ్యాసాలు", "పిల్లల బొమ్మల నార్ల చిరం జీవి" పుస్తకాలను డీఈవో, సాహితీ వేత్తలు ఆవి ష్కరించారు. సాహి తీ వేత్తలను సత్కరించారు. పుంగనూరుకు చెందిన రచయితలు హసీనా బేగం, జమున, సతీశ్‌కుమార్ తెలుగుబాషా సాహిత్య కవితలను వినిపించడంతో సన్మానిం చారు. చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రత్నారెడ్డి, యువశ్రీ, యర్రయ్య, తులసీనాథం నాయుడు, బి. మునస్వామి, త్యాగరాజులు నాయుడులతో పాటు పలువురు సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేకి రైతులు సహకరించాలి



నాయకులు, అధికారులతో సమావేశమైన తహసీల్దారు

రామకుప్పం, ఆగస్టు 27: శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయం, ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అవసరమైన భూముల పరిశీలనకు చేపట్టనున్న సర్వేకు రైతుల సహకరించాలని తహసీల్దారు బాబు నాయకులను కోరారు. మంగళ వారం తహసీల్దారు కార్యాలయంలో స్థానిక నేతలతో సర్వే కోసం ప్రభు త్వం నియమించిన ప్రత్యేక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2500 ఎకరాలు భూములు అవసరం ఉన్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. అందులో భాగంగా మణీంద్రం, విజలాపురం, కిలాడిపోడు, శాంతిపురం మండల పరిధిలోని అమ్మవారిపేట రెవెన్యూ గ్రామాల పరిధిలోని ఉన్న ప్రభుత్వ, డీకేటీ, సెటిల్‌మెంట్ భూములకు సంబంధించిన సర్వే నెంబర్లను సూచనప్రాయంగా ప్రతి పాదించిందన్నారు. ఈ భూములను సర్వే చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా 8 మంది డిప్యూటీ తహసీ ల్దార్లను, 8 మంది సర్వేయర్లను నియమించిందని చెప్పారు. ఇందుకోసం గ్రామానికి వచ్చే సిబ్బందికి రైతులు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆనందరెడ్డి, శ్రీరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, వెంకటరమణ, రఘు, మురళి, సుబ్రహ్మణ్యం, బాలు, భాస్కర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బురుజుపల్లెలో పాలేటమ్మ ఊరేగింపు



సోమల, ఆగస్టు 27: మండలంలోని నెల్లిమంద పాలే టమ్మ వారి మలి జాతర నేపథ్యంలో అమ్మ వారి ఉత్సవ మూర్తిని మంగళ వారం బురుజు పల్లె లో ఊరేగిం చారు. మహిళలు ఇంటిం టా అమ్మ వారికి కర్పూర హారతులు సమర్పించారు. ఊరేగింపులో పోతు రాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ పూజా కార్య క్రమాల్లో మాజీ సర్పంచు కొల్లా హరిప్రసాద్, రమేష్ నాయుడు, పురుషోత్తం, జయచంద్ర పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అమలుకు డిమాండ్



కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

చిత్తూరు, ఆగస్టు 27: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతిగృహాల్లో మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని వసతి గృహాల్లో సరైన మరుగుదొడ్లు లేదని, స్నానపు గదులు లేదన్నారు. మెస్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. వార్డెన్, ఇతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ధర్నాలో సంఘనేతలు షేక్‌బాబు, బాలాజీ, రిషీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం, ఆగస్టు 27: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ భారతి కోరారు. మంగళవారం వెంగళరాజుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత గంజాయి, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలోనే మంచి నడవడికను అలవరచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పెడదోవ పట్టకుండా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు చక్రధర్‌రావు, ఉపాధ్యాయులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వైన్‌షాప్ కార్మికుల ధర్నా



చిత్తూరు, ఆగస్టు 27: ప్రభుత్వ బ్రాందీ షాపుల్లో సేల్స్‌మ్యాన్, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ విజ్ఞప్తి చేశారు. పెండింగ్ జీతాలను విడుదల చేయాలన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముందు ఈ కార్మికులు నిరసన వ్యక్తంచేశారు. నాగరాజన్ మాట్లాడుతూ మద్యం షాపుల్లో 15వేల మంది సేల్స్‌మ్యాన్, సూపర్‌వైజర్లు,సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వైన్‌షాపులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనుండటంతో వీరు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు.

మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత తప్పించాలి : యూటీఎఫ్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 27: మరుగుదొడ్ల ఫోటోల బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తొలగించాలని యూటీఎఫ్ నాయకులు మంగళవారం డీఈవో దేవరాజుకు వినతి పత్రం ఇచ్చారు. వారిని బోధనకు పరిమితం చేయాలని కోరారు. ఈ విధుల నుంచి తప్పిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా, ఫోటోలు అప్‌లోడ్ చేసే బాధ్యతను హెచ్‌ఎంలకు అప్పగించడం సరికాదన్నారు. డీఈవో వినతి పత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండ, జగన్మోహన్, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సంస్కారం: శతావధాని మురళి


సమావేశంలో మాట్లాడుతున్న మురళి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 27: చదువుతో పాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలని శతావధాని ఆముదాల మురళి అన్నారు. మంగళవారం స్థానిక గాండ్లపల్లి ఉన్నత పాఠశాలలో అమృత భారతి ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాటాడారు. చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిని పరిరక్షించాలన్నారు. స్వామి వివేకానందుడి జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం గీతాంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశాన దారిలో తుడా నిర్మాణంపై విచారణ


విచారణ చేస్తున్న అధికారులు

నగరి ఆగస్టు27: మున్సిపాలిటీ పరిధిలోని నెత్తంకండ్రిగ వద్ద శ్మశానమార్గంలో తుడా గోడ నిర్మాణం వల్ల తమకు దారి లేదని స్థానికులు ఇచ్చిన వినతిపై తహశీల్దార్ రవికుమార్‌కు స్పందించారు. మంగళవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి సర్వే చేపట్టారు. తుడా భూసేకరణ అధికారి సుజన, డీవీఎస్‌రెడ్డి, బాలయ్య, తహశీల్దార్ రవికుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి నీరజాక్షి స్థలాన్ని పరిశీలించారు. రికార్డులను పరిశీలించా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గ్రామస్తులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ పేర్కొన్నారు. ఆర్ఐ,సర్వేయర్, నెత్తంకండ్రిగ వీఆర్‌ఓ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళి

ఐరాల, ఆగస్టు 27: ఐరాల జూనియర్ కళాశాలలో మంగళవారం ఎమ్మెల్యే మురళిమోహన్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఖర్చుతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందిస్తోందన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు. కళాశాలలో మెరుగైన ఉత్తీర్ణత సాధించి ప్రథమస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకుడు గిరిధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ లత, ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు, దయానంద మందడి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన శిబిరం

యాదమరి, ఆగస్టు 27: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు కోర్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కోర్ సంస్థ మేనేజర్ సద్దాం మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది, రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమావేశంలో కోర్ సంస్థ అవుట్‌రీచ్ వర్కర్ ద్రాక్షాయణి, శెల్వి, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డీవీఎంసీ సమావేశం

చిత్తూరు, ఆగస్టు 27: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ రెండవ అంతస్థులో జరగనుంది. జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి రాజ్యలక్ష్మి మంగళవారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి డీవీఎంసీ కమిటీ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఎంపీకి టీడీపీ నేతల స్వాగతం



పూతలపట్టు, ఆగస్టు 27: ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు మండల టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. మంగళవారం ఆయన తిరుపతి నుంచి చిత్తూరుకు వస్తూ పూతలపట్టులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీని పలువురు నాయకులు శాలువలతో సన్మానించారు. ఎస్సీసెల్ నాయకులు దూర్వాసులు, సుబ్బరాజులు, ముత్తు, గురుస్వామి, గిరి, పురుషోత్తం, చందు, వీరభద్రయ్యతో పాటు పలువురు ఎస్సీసెల్ నాయకులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి సీజ్

చిత్తూరు, ఆగస్టు 27: రెండు కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం ఒకటో పట్టణ పోలీసులు రెడ్డిగుంట జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. వేలూరు వైపు నుంచి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో గంజాయి పెట్టుకుని వచ్చాడు. పోలీసుల చూసి గంజాయి బ్యాగును కిందపడేసి పరారయ్యాడు. పోలీసులు బ్యాగును పరిశీలించగా రెండు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



శ్రీరంగరాజపురం, ఆగస్టు 27: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు ఎస్ఆర్‌పురం మండలం 49. కొత్తపల్లెమిట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, గంగాధర నెల్లూరు మండలం ముక్కతూరు గ్రామ పరిధి నీవానది నుంచి పర్మిట్లు లేకుండా అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించారు. వెంటనే సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ సుమన్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి


డేవిడ్ బాబు మృతదేహం

బంగారుపాళ్యం, ఆగస్టు 27: విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని కీరమంద పంచాయతీ కామాక్షిపురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు డేవిడ్ బాబు అలియాస్ గణపతి (36) పెయింటర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం ఓ ఇంటికి సున్నం వేస్తుండగా సమీపంలోని డిష్ వైరు తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఏఎస్ఐ మల్లప్ప దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ కోదండరెడ్డి కన్నుమూత



గంగాధరనెల్లూరు, ఆగస్టు 27: బుక్కాపట్నం మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ కోదండరెడ్డి(72) మంగళవారం కన్నుమూశారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన భౌతికకాయంపై ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు, బీజేపీ మండలాధ్యక్షుడు మురళి నివాళులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు


సమావేశంలో మాట్లాడుతున్న యువరాజు

వెదురుకుప్పం, ఆగస్టు 27: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కలసికట్టుగా విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు యువరాజు, రామిశెట్టి రాజశేఖర్ కోరారు. మంగళవారం కార్వేటినగరంలో బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుపై చర్చించారు. సెప్టెంబరు 1వ తేది నుంచి సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ముందడుగు

● మండల సమావేశంలో ఎమ్మెల్యే థామస్


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, ఆగస్టు 27: కార్వేటినగరం మండలాభివృద్ధికి పార్టీలకతీతంగా కలసి పనిచేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ పిలుపునిచ్చారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లత అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా థామస్ హాజరయ్యారు. వైసీపీ, కాంగ్రెస్, జనసేన,బీజేపీ, టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ బేధాలు లేకుండా మౌలిక వసతుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే నిధులు మంజూరు చేయిస్తామన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీలకు వారంలో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన భూముల పట్టాలు, పాసుపుస్తకాలపై ఇక జగన్ ఫొటో ఉండదన్నారు. జగనన్న కాలనీలను కూడా చంద్రబాబు కాలనీలుగా పేరు మార్చి ఎవరి ఫొటోలు లేకుండా త్వరలో పట్టాలు అందజేస్తారన్నారు. మండలంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.4.26 కోట్లు ఇప్పటికే మంజూరు చేయించామన్నారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ పనులకు మంజూరైన నిధుల్లో కమీషన్ల కక్కుర్తికి వల్ల జలాశయ పనులు ఆగిపోయాయన్నారు. మిగులు భూముల వివరాలిస్తే పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేద్దామంటే రెవెన్యూ శాఖ అధికారుల్లో స్పందన కనిపించలేదన్నారు. కబ్జాకు గురికాకుండాచెరువులు, కుంటలు, కాలువలను కాపాడాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

భాషాభివృద్ధికి గిడుగు కృషి అపారం: డీఈఓ


సైన్స్ వ్యాసాలు, పిల్లల బొమ్మల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 27: మాధుర్యమైన తెలుగుభాష ప్రాంతాల వారీగా వివిధ యాసల్లో హృద్యంగా ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు అన్నారు. భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి చిరస్మరణీయులన్నారు. ప్రభుత్వ మ్యాంగో భవన్‌లో మంగళవారం వాడుక భాషా ఉద్యమకారుడైన గిడుగు జయంతి వేడుకను తెలుగు భాషా దినోత్సవంగా ఉమ్మడి సాహితీవేత్తల సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కట్టమంచి బాలక్రిష్ణారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. హరివిల్లు లితకళా పరిషత్ నిర్వాహకులు హరినాయుడు తెలుగు భాషావైభవాన్ని విశదీకరించారు. గిడుగు చిత్రపటానికి సాహితీవేత్తలు పుష్పాంజలి ఘటించారు. అనంతరం కవిసమ్మేళనం, చిన్నారులకు పద్య, గద్య పోటీలు నిర్వహించారు. రచయిత్రి శాంతభాస్కర్ రచించిన 'బాలలకోసం సైన్స్ వ్యాసాలు', 'పిల్లల బొమ్మల నార్ల చిరంజీవి' పుస్తకాలను డీఈవో, సాహితీవేత్తలు ఆవిష్కరించారు. సాహితీవేత్తలను సత్కరించారు. చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రత్నారెడ్డి, యువశ్రీ, యర్రయ్య, తులసీనాథం నాయుడు, మునస్వామి, త్యాగరాజులు నాయుడులతో పాటు పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు ఆపాలని నిరసన



చిత్తూరు రూరల్, ఆగస్టు 27: వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలను ఆపాలని కమర్షియల్ ట్యాక్స్ సర్వీసస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్ణం డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరు కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పునర్వ్యవస్థీకరణ పేరిట జరిగిన తప్పిదాలపై విచారణ చేపట్టి సరిదిద్దాక బదిలీ చేప్పట్టాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని కోరారు. అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు


రామాపురంలో పుష్పపల్లకిలో కృష్ణుడు

చిత్తూరు కల్చరల్ ఆగస్టు27: స్థానిక చర్చివీధిలో రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో రెండు రోజులుగా కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయ ట్రస్టీ బుల్లెట్ సురేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం, అభిషేకం, నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. బుధవారం కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామని సురేష్ కోరారు. స్థానిక కోదండరామాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. హైరోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో రెండో రోజు స్వామివారికి గరుడసేవ నిర్వహించారు. **గుడిపాల:** మండలంలోని 197 రామాపురంలో శ్రీకృష్ణ జయంతి సందర్భంగా మంగళవారం గ్రామస్థులు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 40 సంవత్సరాలుగా బాణసంచా, మంగళవాయిద్యాల మధ్య పుష్పపల్లకి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



గుడిపాల, ఆగస్టు 27: మండలంలోని మండిక్రిష్ణాపురం గ్రామంలో మంగళవారం వైదేహీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 108 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కొంతమందికి ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మోహిత్, కిరణ్, సరస్వతి, సముద్ర, సురేష్, కార్తిక్, మండల జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, సునీల్, మండిక్రిష్ణాపురం యూత్ నరసింహ, ఉదయ, అరుణ్, నవీన్, రామచంద్రారెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళెమ్మ జాతరలో ఎమ్మెల్యే థామస్ పూజలు


ఎమ్మెల్యే డాక్టర్ థామస్, ఎర్రగుంట్ల క్రిష్ణమనాయుడులకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 27: పాతపాళ్యం దళితవాడలో కాళెమ్మ జాతరలో మంగళవారం సాయంత్రం అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దర్శించుకున్నారు. అంతకు ముందు మిట్టకొత్తూరులో ఆయనకు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, పంచాయతీ సర్పంచ్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, బాలాజి మొబైల్స్ షాపు యాజమాని ఎంప్రాల వెంకటేశులునాయుడు ఘనస్వాగతం పలికి సన్మానించారు. దళితవాడలో మహిళలు మంగళహారతులు ఇచ్చారు. ఆయనకు వివిధ సమస్యలపై నేతలు అర్జీలను అందజేశారు. వెంకటేశులునాయుడు, నరసింహులునాయుడు, మోహన్‌నాయుడు, స్వామిదాస్, దేవసుందరం, నియాజ్‌అలీ, లోకనాధ యాదవ్, వెంకటేష్‌నాయుడు, రఘునాథనాయుడు, యాగమరెడ్డి, కామసాని కోదండరెడ్డి, దీపక్ నాయుడు, క్రిష్ణారెడ్డి, సుబ్రమణ్యం, జీవరత్నం, రవి, దినేస్, చంద్ర, ముత్తు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ


భోజనాన్ని పరిశీస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి ఆగస్టు27: తడుకుపేట పంచాయతీ పరిధిలోని దొమ్మరిండ్లు ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ శ్రీదేవి తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించారు రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



చిత్తూరు క్రీడలు, ఆగస్టు 27: జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎస్‌ఏ మైదానంలో తొలుత విద్యార్థులు 'ఫిట్ ఇండియా' ఇండియా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వీరికి లాంగ్ జంప్, షాట్‌పుట్, పరుగుల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. డీఎస్‌ఏ కోచ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆటల పోటీలను ఇన్‌చార్జి హెచ్‌ఎం సరస్వతి లాంచనంగా ప్రారంభించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ త్యాగరాజు, వ్యాయమ ఉపాధ్యాయుడు తిరుమలరాజు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

అలరించిన చిన్నారుల వేషధారణ



వెదురుకుప్పం, ఆగస్టు 27: కార్వేటినగరం మండలం కొల్లాగుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జన్మాష్టమి వేడుకలను మంగళవారం నిర్వహించారు. చిన్నారులు వేషదారణలు అలరించాయి.

పాడి రైతులకు పాలక్యాన్ల పంపిణీ



వెదురుకుప్పం, ఆగస్టు 27: కురివికుప్పంలో పాడిరైతులకు మంగళవారం శ్రీజ పాలడైయిరీ ఏరియా కో-ఆర్డినేటరు పి.కుమార రాజా పాలక్యాన్లను పంపిణీ చేశారు. తమ డెయిరీలో పాలకు గిట్టుబాటు ధర ఇస్తున్నామని చెప్పారు. మొక్కజొన్నలను కూడా పంపిణీ చేశారు.

విద్యార్థులకు కంప్యూటర్ల వితరణ



వెదురుకుప్పం, ఆగస్టు 27: కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వి.కోటకు చెందిన దశరథరెడ్డి పది కంప్యూటర్లను సమకూర్చారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వరూప మంగళవారం ఈ విషయం తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి దాత ఇచ్చిన కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుంటామన్నారు. వీటి విలువ రూ.2.5లక్షలు ఉంటుందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు27: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. తూర్పు మొగసాలకు చెందిన నాగరాజ కుమారుడు వినోద్‌కుమార్(33) సొంత పనులపై ద్విచక్రవాహనంలో రామసముద్రం వెళుతుండగా కేసీ పల్లె వద్ద కుక్క అడ్డురావడంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. వినోద్‌కుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు..

పట్టణంలో ఆటో చోరీ

పుంగనూరు రూరల్, ఆగస్టు 27: పట్టణంలోని కొత్తపేటలో ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. కొత్తపేటకు చెందిన రెహమాన్(35) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి ఆటోను ఇంటి ముందు ఉంచాడు. ఉదయం నిద్రలేచి చూడగా ఆటో కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పూల దుకాణంలో చోరీ నగదు రికవరీ

పలమనేరు, ఆగస్టు27 : స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పూలదుకాణం వద్ద నగదు చోరీ చేసిన మహిళను పూలదుకాణదారులు పట్టుకున్నారు. మంగళవారం ఒక పూలదుకాణం నిర్వాహకురాలు పక్క దుకాణం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ మహిళ దుకాణంలో వెయ్యి చోరీ చేసింది. ఇతర పూలదుకాణదారులు గుర్తించి ఆమెను పట్టుకున్నారు. చోరీసొత్తు స్వాధీనం చేసుకున్నారు.

గ్రామాల్లో దోమలు బాబోయ్ దోమలు

● పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానం

● ఆందోళన చెందుతున్న పల్లె ప్రజలు


పాపిరెడ్డిపల్లెలో పారిశుధ్యం తీరిది..

శ్రీరంగరాజపురం, ఆగస్టు 27: గ్రామీణ ప్రజలపై దోమలు దాడి చేస్తున్నాయి. వర్షాలు అంతంతమాత్రం అయినప్పటికీ పారిశుధ్యం లోపించడంతో ఇవి విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడే మురుగుతిష్ట వేసి పారిశుధ్యం లోపాన్ని ఎత్తిచూపుతోంది. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో కొంతమేర ద్రావకం చల్లుతున్నప్పటికీ దోమలు వృద్ధి చెందుతూనే ఉన్నాయి. ఇప్పటికే పలు మండలాల్లో దోమకాటు ఫలితంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. మురుగు నిల్వలు తొలగించి మందులు పిచికారీ చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లాల్సిన అవసరం ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్యం అస్తవ్యస్థంగా మారింది. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక కొంతమేర నిధులు విడుదల చేసింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచి దోమల స్వైరవిహారాన్ని కట్టడి చేయాలని స్థానికులు వాపోతున్నారు. తమ గ్రామంలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని దిగువపాపిరెడ్డికు చెందిన మణి ఆవేదన వ్యక్తం చేశారు.